"రాము ! ఎందుకురా, ఆయన మీద నీకంత కోపం ? ఆయన నీకేం హానీ, అపరాధం చేశారనీ !" ఎన్నో సార్లు ఎందుకులే అని ఊరుకున్నా, వార్ధక్యం వల్లనో, ఆయనపైగల అనన్య భక్తి భావం వల్లనో మరి, మనసులో రగులుతున్న అగ్ని శిఖలను అణచుకోలేకపోయి బయట పడ్డాను.

"కోపం కాదు, అసహ్యం ! కసి !! వాళ్ళే.. వాళ్ళే అనాదిగా మనల్ని అణగ ద్రొక్కారు. బానిసలను చేశారు. అయినా నువ్వు అతన్నే నెత్తికెక్కించుకుంటున్నావు. ఆయన నీకు చేసిన మహోపకారం ఏంటి ? మళ్ళిచ్చాడా ? మాణ్యాలిచ్చాడా ? స్లో పాయిజన్‌లా – ఎన్నటికీ అతని చుట్టూ తిరుగాడే బానిస తనాన్ని ఇంజక్ట్ చేశాడు కుక్కకి రొట్టె ముక్కేసాడు. నీలాటి వాళ్ళుండబట్టే వ్యవస్థ ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉండిపోయింది. మెకాలే మనల్ని ఎదగనివ్వని విద్యావిధానాన్ని అంటగట్టిపోతే – ఈళ్ళు మనల్ని మెదడు లేని మనుషుల్ని చేసి ఇడిచిపెట్టారు" అన్నాడు ఎన్నడూ నా ముందు నోరు కదిపి మాట్లాడని నా కొడుకు.

# నేను బానిసనే!

## పి.వి.బి. శ్రీరామమూర్తి

వాడి మాటలకు నాక్కోపం రాలేదు. వాడి మాటలు నూటికి నూరుపాళ్ళు నిజం కాకపోయినా, కొంత నిజం ఉంది. అందుక్కారణం, ఉదాహరణ వాళ్ళ మేస్టారే. లెక్కల్లో సున్నా వచ్చినపుడు కారణాలు తెలుసుకోకుండా చెప్పులు కుట్టుకుని బతకమని, తాళ్ళు పేనుకుని జీవించమని తిట్టారట !

ఆ మాస్టారలా అనటం ముమ్మాటికీ తప్పే ! ఆ విషయం తెలిసీ వెంటనే స్పందించి చర్యతీసుకోకపోవటం – మా వాడు చెప్పినట్లు ఈ సంస్కృతి నేర్పిన 'ఒదిగి' ఉండమన్న లక్షణం తప్పో, నా తప్పో నేం చెప్పలేను. అయితే వ్యవస్థలో , సంఘంలో ఉన్న మనుషులందరూ ఆలాటివారే అనుకోవటం మావాడి తప్పే ! ముఖ్యంగా 'సత్యారావు' మాస్టారి లాటివార్ని అర్థం చేసుకోకుండా మాట్లాడ్డం తప్పే అంటాను !

కొన్ని దశాబ్దాలు వెనక్కి వెళ్తే . . .

***

శ్రీకాకుళం జిల్లాలో 'ముషిడివలస' ఓ కుగ్రామం. మారుమూల పల్లె. ఊళ్ళోకెళ్ళాలంటే కాలినడకన కాశీ ప్రయాణం చేసినట్టే. పట్నం నుంచి పది మైళ్ళు. అక్కణ్ణించి మూడు కొండలు దాటి. . . మూడు వేల గడప. ఊరికి మధ్యలో మంచి నీటి బావి. అక్కడే తెల్లారగట్ల నుండి స్నానాలు. ఒక ప్రక్క ఆడ మరో ప్రక్క మగ ! అక్కడే విశాలంగా ఉన్న వేప చెట్టు కొమ్మలు విరిచి పళ్ళు తోముకుని, తాటిరేకు చేదలతో నీళ్ళు తోడుకుని నోరు పుక్కిలించుకుని ముఖాలు కడుక్కోవటాలు. కొన్ని ఫర్లాంగుల దూరంలో హరిజనవాడ. తూర్పున అరమైలు దూరంలో ఎలిమెంటరీ స్కూలు.

ఆ పాఠశాలలో ఒకే ఒక మాస్టారు సత్యారావు గారు. ఆ గ్రామ జనాభాలో పది కుటుంబాలు బ్రాహ్మణ కుటుంబాలు. ఆ గ్రామ పరిభాషలో 'బేపనెయ్యిలు' సగానికి మించి కాపుదనం, పాతిక కుటుంబాలు ఎర్రగొల్లలు. వాళ్ళెప్పుడూ ఊళ్ళో ఉండరు. కోమట్లూ, షరాబులూ మైలు రాళ్ళలా అక్కడక్కడే. ఊరికి చివర హరిజనవాడలో యాభై ఇళ్ళుంటాయి. వాళ్ళే గ్రామానికి గుండెకాయలని చెప్పాలి. బ్రాహ్మణ కుటుంబాల నుండి మగా ఆడా తేడా లేకుండా అయిదుగురేసి పిల్లలు ఎగనామం పెట్టకుండా చదువుకోవటానికి వస్తారు. సత్యారావు మాస్టారు కూడా వాళ్ళ కుటుంబానికి చెందిన వారే. కాపు కుటుంబం లోంచి కొంతమంది డబ్బున్న వాళ్ళ పిల్లలు, వైశ్య, విశ్వ బ్రాహ్మణ కుటుంబాల నుండి కొంత మంది పిల్లలు ఠంచనుగా బడికొచ్చే వారే!

ఎటొచ్చీ హరిజనవాడ నుండి మాత్రం ఒక్కరూ చదువుకోవటానికి రాకపోవటం సత్యారావుగారిని బాధించే విషయం. సత్యారావు నాకెందుకులే అని ఊరుకోలేదు. ఆయన గాంధేయవాది. 'హరిజనుడై పుట్టిన రోజు – హరిజనుడే పుట్టిన రోజు !' అని హరిజనోద్ధరణ జరిగే రోజు – అంటరానితనం తొలగిన రోజే – ఈ దేశం బాగు పడుతుందని ప్రబలంగా నమ్మిన వ్యక్తి !

ఓ ఆదివారం హరిజనవాడకు తెల్లారుతూనే వెళ్ళాడు. అక్కడ దృశ్యాలు అతణ్ణి కలిచి వేశాయి. వర్షానికి కరిగి కూలిపోతున్న మట్టిగోడలు. వెలుగు నీడలు దోబూచులాడుతున్న తాటికమ్మల ఇళ్ళు. వాకిట్లో మట్టి పొయ్యిలు. పొయ్యిల మీద కుండలు. కుండల చుట్టూ మసి పెచ్చులు. వాకిట్లో నులక మంచాలు. నులక మంచం మీద చిరిగిన గావంచాలు కప్పలేని శరీర భాగాలతో కాళ్ళు చాపుకు పడుకుని – చుట్ట పొగలుగా వదులుతున్న మగరాయుళ్ళు. పొయ్యి దగ్గర నేలకు ఒంగి – పొగ చిమ్ముతున్న తాటి మట్టలను రాజేస్తూ – నోటితో ఊదుతున్న అతివలు – కొందరి నోట్లో పొగాకు చుట్టలు అడ్డపొగలువేస్తూ – పొగను గుప్పు గుప్పున వదులుతున్న వాళ్ళు. తల్లి పొయ్యి మీద కుండలో అంబలిని తెడ్డుతో కలుపుతుంటే – చంకలోంచి దూరి స్తన్యాన్ని గ్రోలుతున్న పసి కూనలు. వాళ్ళు పాలు తాగుతున్నట్లు గమనించనే గమనించక వాళ్ళ పని చూసుకుంటున్న తల్లులు. పళ్ళు కూడా తోమకుండా సిలవరి బొచ్చెల్లో అంబలిని జుర్రుతున్న అయిదూ, పదేళ్ళ పిల్లలు. రాత్రి తాగిన మత్తు ఇంకా తొలగక – కడుపులో పేగులు నకనక లాడుతోంటే

– ఆకలి కేకలతో తల్లీ – చెల్లీ – పెళ్ళాం తేడాలు తెలీక – నోటికొచ్చిన బూతులు వెదజల్లుతున్న పాచినోళ్ళు – బలహీనులయిన మొగుళ్ళ మీద తిరుగుబాటు చేస్తోన్న ఆడవాళ్ళు – ఆ . . చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు – ఒళ్ళల్లా పాకిన నాటు సారా – శక్తి హీనులని చేసినా మగతనాన్ని ప్రదర్శించాలని పౌరుషం బుసలు కొడుతూ ఉంటే – కోరలు తీసిన నాగుపాములా లేవటానికి ప్రయత్నించి లేవలేక పడిపోతున్న వాళ్ళు – చేతి కందిన కొరకంచుతో గొడ్డును బాదినట్టు – ఇది 'నా పెళ్ళాం – నా హక్కు' చంపుతాను. కొడతాను – తిండి పెట్టకపోయినా ఆడగటానికి వీల్లేదని విజృంభిస్తున్న మగరాయుళ్ళు! చుట్టూ మంటలు ఎగిసిపడుతుంటే – ఎటు పోవాలో తెలీక హా హా కారాలూ, ఆర్తనాదాలూ చేస్తూ అటూఇటూ పరుగులు తీస్తున్న అసహాయుల్లా – మొగుళ్ళు కొడుతుంటే – గోల చేస్తూ రంకెలేస్తోన్న అర్థ వస్త్రధారణలో అల్లాడుతోన్న వారి పెళ్ళాలు – చేల్లో పడ్డ గోవును పొలంకాపు వెంటపడుతుంటే – తల్లి వెనక బెంబేలెత్తి పరుగెడుతోన్న దూడలా – తండ్రి తల్లిని కొడుతూంటే – తల్లి కొంగు పట్టుకుని భయంతో పరుగులు తీస్తోన్న సంతానం !

–ఇలాటి దృశ్యాలు ఎన్నో, ఎన్నెన్నో !

సత్యారావు మాస్టారి గుండె తరుక్కుపోయింది.

''ఏటి మేస్టూ ! ఏటిలగొచ్చినవు. ఇదిగో ! దీన్ని ఒట్టుకుపో. వాడుకో. నాను తిండెట్టలేనని నన్ను కొడుతోంది. ఏటి, నాను తిండెట్టకపోతేనే ఇదింతలా బలిసిపోయింది. నువ్వు జీతగాడివి.కూడెట్టు . . నీకు మస్తుగా సుకాన్నిస్తాది. డోకానేదు. నాకు మాత్రం మందుకింతిచ్చి, ఇదిగో – ఇష్ (నవ్వు) రేత్రి కొగ్గి. పాండవులు ద్రౌపదిని ఓడుకున్నట్లు – మనిద్దరం చెరుసగం. ఏటి నీ కిట్టమైతే సెప్పు – ఇప్పుడొద్దులే. ముస్తాబై వత్తాది. నీనెల్లి పోతాను నీ ఇట్టం. డబ్బులు పడీ, బోణీ !'' అని చెయ్యి చాపిన రుద్రయ్య మాటలకు స్థాణువైపోయాడు సత్యారావు మాస్టారు.

''ఇదిగో !. . . . తప్పు . . . తప్పు . . . ఆమె నాకు చెల్లిలాటిది. . . నేను వచ్చింది . . . మీ పిల్లల్ని బళ్ళోకి పంపమని చెప్పటానికి'' అన్నాడు తడబడుతూ.

అప్పుడు , అక్కడున్నది పోలారావు. అయిదేళ్ళ వయసువాడు. బడి అంటే అర్థం కాక అయోమయంగా చూశాడు. చేతిలో కాలిన ఎండు చేప కొరుకుతూ, రుద్రయ్య కొడుకే !

రుద్రయ్య పెళ్ళాం ఎర్రమ్మ, మీద పడుతున్న పెనిమిటిని ఎడం చేత్తో వెనక్కినెట్టి ''మారాజు పెబువు ! కూర్చో బావు. ఇడమర్చి సెప్పు. బడికా ? మామా ?'' అంది అర్థం కాక.

''ఓహో, ఆ దారిలోనొస్తన్నావా ? పిల్లాణ్ణి సదువుకు పంపే నెపంతో పైసలివ్వకంట – మా యాడదాయిని వోడేసుకుందామనా ? ఓలమ్మ గోలేమే... పతివోడపాలేమే?'' అంటూ నాట్యం చేశాడు రుద్రయ్య.

ఎర్రమ్మ కర్ర తీసింది. ''ఇదిగో, దీంతో మక్కమీ దొక్కటిచ్చానంతే మరి నెక్కంటయిపోగలవు. నోర్మూసుకునుండు'' అంది.

ఏమనుకున్నాడో రుద్రయ్య మారు మాటాడలేదు.

''నీ పేరేంటమ్మా ?''

''ఎర్రమ్మ !''

''ఇదిగో, ఎర్రమ్మా ! నీకు పిల్లలెంత మంది !''

''ముగ్గురు తండ్రి. ఇదిగీడు పెద్దోడు. రెండోది అమ్మి. ఇంక నెగనేదు. ఇదిగీ సంటోడు మూడోవోడు. ఒంటికి బట్ట – పొట్టక్కూడూ పెట్టనేకపోయినా – సరదాలకి నోటునేదు మా మొగోల్లకు. కాలీనేకంట సంవత్సరానికొ కల్ని కనీసి ఒగ్గేత్తన్నారు. ఈడి తరువాత రెండు కాన్పులు పోనాయి బాబు.'' అంది పైట కప్పుకుంటూ.

''సరే. ఎర్రమ్మా ! ఊళ్ళో బడి ఉంది. మీరేం డబ్బులు కట్టనవసరం లేదు. బడికి పంపండి మీ పిల్లల్ని. చదువుకుంటే రానున్న రోజుల్లో మీకు ఎన్నో అవకాశాలు వస్తాయి. నా మాట నమ్ము'' అన్నాడు.

''ఉస్ ! ఇంకేటే నీ బొట్టిడు కలికిటేరయిపోతాడూ. నువు పట్టుసీర కట్టుకుని. . . . బంతిపూలు ముడుసుకుని...'' అంటూ నాట్యం చేశాడు రుద్రయ్య పాటపాడుతూ.

''ఇదిగో ! వల్ల కుంతావా ? ఇరిసి పొయ్య పెట్టమంతావా ?'' అంది కోపంగా. వాడు తగ్గాడు.

'' ఓ లమ్మా . నానెల్లనే. నాకా బడొద్దే. ''తల్లిని బక్కుతూ అన్నాడు పోలారావు. ''వోరెందుకురా, అలగయిపోతావ్ ?'' అని వాణ్ణి విసిరికొట్టి – ''బాబూ ! తెల్లారి నెగిసిన కాణించీ ఇద్దిదీ బాగోతం. సూత్తన్నావుగదా ! ఈణ్ణే పాలేరుగానో అమిరిచెస్తే – నాకింత గంజినీళ్ళకి నోటుండదని నా బాద. ఈణ్ణి బళ్ళోకి పంపితే ఈడికేటొత్తాది సెప్పండి ?'' అంది.

''ఎర్రమ్మా ! అలాగనకు. పుట్టగానే ఎవరూ మహానుభావులు కారు. అంబేద్కర్ మీ లోంచి వచ్చినవాడే. ఎన్నో కష్టాలు పడ్డాడు. తిండిలేని రోజులూ, నిద్రలేని రాత్రులూ గడిపాడు'' మహాపురుషుడయ్యాడు'' అన్నాడు.


''అలగంతావా ? అయ్య, పోలా, రేపట్నిండెల్లిపోరా ?'' అన్నది.

''అమ్మ నీనెల్లనే !'' అన్నాడు.

వీపు చిట్ల గొట్టింది. వాడు గొల్లు మన్నాడు.

''ఆడు నా కొడుకే! నాతో తాగనానికొత్తాడు . . . కదరా !''

''ఇదిగో నువ్వు నోర్మూత్తావా, ముయ్యవా ! ముండ సమాది



గాడు సచ్చిపోతండు. కూసేగాడిద మేసీ గాడిదని పాడు 'సేసినాదని'' అని పక్కలో పొడిచింది పిడికిలితో. ' అమ్మా ! సచ్చిపోనానే !' అని మంచం మీద పడిపోయాడు.

ఆ తరువాత ''ఎర్రమ్మా ! ఇంకెవరైనా ఉంటే చెప్పు'' అన్నాడు సత్యారావు మాస్టారు.

''పదండి బాబూ !'' అని మరో అయిదుగురుని కూడదీసింది.

ఆ తరువాత రెండు రోజులు ఎర్రమ్మ పిల్లల్ని

వెంట బెట్టుకుంటూ వచ్చేది. మూడో రోజు పోలారావు గైర్హాజరయిపోయాడు.

సత్యారావు పిల్లల్ని పంపాడు పోలారావుని తీసుకురమ్మని. పోలారావు బడి పిల్లల్ని చూసి మంచం కింద దాక్కుండి పోయాడు. పిల్లలు బలవంతంగా వాణ్ణి బయటకు లాక్కొచ్చారు. మధ్య తోవలో ఒంటేలుకు వస్తోందంటే వాళ్ళాగారు. వాళ్ళు పరాగ్గా ఉండటం గమనించిన పోలారావు కిందికి ఒంగి, గుప్పెడు ఇసుక చేతిలోకి తీసుకుని వాళ్ళకళ్ళలోకి విసిరేడు. పిల్లలంతా 'అమ్మో ! అని కళ్ళు కనిపించక గోల చేసే సరికి పారిపోయాడు.

అది ఊళ్ళో పెద్ద రభసయిపోయింది.

ఆ వెళ్ళిన పిల్లల్లో నాయుడు మనవడు, కోమటి కన్నారావు కొడుకు, కంసాలి గంగరాజు కొడుకూ ఉన్నారు. 'మాలపల్లి'కి మా పిల్లల్ని పంపటానికా 'బడికి పంపుతున్నాం ?' అని నిలదీశారు. నాయుడయితే చెయ్యి చేసుకున్నంత పని చేశాడు. ఇకెప్పుడూ పిల్లల్ని పంపనన్నాడు.

ఇక్కడిలా జరిగితే –


తప్పించుకున్న పోలారావు ఇంటికీ వెళ్ళలేదు. ఆ రోజంతా కనిపించలేదు. రుద్రయ్య తప్పతాగి మీదకొచ్చాడు. రుద్రయ్యతోపాటు పిల్లల్ని స్కూళ్ళకు పంపటం ఇష్టంలేని తండ్రులూ సత్యారావు మీద తిరుగుబాటు చేశారు. తమ పిల్లణ్ణి కోమటి జగ్గారావే కొట్టాడని – ఎవరో చెప్పారని – తాగడానికి జగ్గారావు డబ్బులిస్తే కానీ వీల్లేదని భైఠాయించారు. ఎందరు చెప్పినా వినలేదు. చివరకు వాళ్ళందరికీ కొంత పైకం ఇచ్చి పంపాడు. దాంతో జగ్గారావు తన కొడుకును స్కూలుకు పంపటం మానేశాడు. కొంతమంది పిల్లలూ బడి మానేశారు. నూరుమంది పిల్లల బడి ఎనభైకి పడిపోయింది. సత్యారావు ఇంటింటికీ వెళ్ళి బ్రతిమిలాడాడు.

హరిజనవాడ నుండి పిల్లలు రాకపోతే తనే వెళ్ళి తీసుకొచ్చేవాడు. ఒకసారి పిల్లలు రాలేదని హరిజనవాడకు వెళ్ళాడు. పిల్లలకి పని ఇచ్చి – తరగతికి ఇద్దరు మోనిటర్లను పెట్టి మరీ హరిజనవాడకు వెళ్ళాడు. తిరిగొచ్చేసరికి ఇంకేముంది ?

పెద్ద యుద్ధం జరిగిపోతోంది.

ప్రెసిడెంటు గారమ్మాయిని నాయుడుగారబ్బాయి చూస్తుండగా – షరాబులబ్బాయి జడలాగాడట. ఊళ్ళో పెద్ద దుమారం. నాయుళ్ళు కర్రలు పట్టుకొచ్చారు. సత్యారావుని చంపేస్తామంటూ. అదృష్టవశాత్తూ – నాయుడు కొడుకూ – సత్యారావూ క్లాస్‌మేట్లు కావటాన – నాయుడు కొడుకు విషయం తెలుసుకుని శాంతించాడు. అంతా సద్దుమణిగింది.

హరిజనవాడ పిల్లల కోసం సత్యారావు ఇంటి నుండి తల్లిచేత వంట చేయించి – వాళ్ళకి స్కూల్లోనే భోజనాలు పెట్టే ఏర్పాటు చేశాడు. ఇంటర్వెల్ టైములో పిల్లలందరికీ బఠాణీలో, వేపిన శనగలో ఇచ్చేవాడు. విదేశీ సంస్థలందించే ఉప్మా – పాలూ పిల్లలకు దగ్గరుండి ఇప్పించేవాడు.



ఒక స్వాతంత్ర్య దినాన హరిజనవాడలో అందరితో కలసి భోజనాలు ఏర్పాటు చేశాడు. ఉదయాన్నే పాఠశాలను మువ్వన్నెల జండాలతో అలంకరించారు. ఊరంతా పిల్లలచేత తుడిపించాడు. మంచినీటి బావి చుట్టూ నిలవ ఉన్న మురికి నీరుకి కాలువ ఏర్పాటు చేశాడు. శ్రమదానం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటించాడు బడి చుట్టూ. స్వాతంత్ర్య గీతాలు పాడించాడు. నగరం నుండి ఓ పెద్దాయనని పిలిచి ఉపన్యాసాలిప్పించాడు. పిల్లలకు ఆటల పోటీలుపెట్టి బహుమతులిప్పించాడు. ఊళ్ళో కొంతమంది యువకుల్ని తోడు తీసుకుని హరిజనవాడను పరిశుభ్రం చేయించి – వాళ్ళచేత వండించి – సహ పంక్తి భోజనాలు చేయించాడు.

పట్నం నుండి వచ్చిన పెద్దాయన సంఘ సంస్కర్త. పేరూ, పలుకుబడీ ఉన్న వ్యక్తి కావటాన ఎవ్వరూ కిమ్మనలేకపోయారు. ఆయన వెళ్ళిన తరువాత సత్యారావు మాస్టార్ని నడివీధిలో నిలబెట్టి చిత్రహింసలు చేశారు. సహ వర్ణాలవారు కులభ్రష్టుడని ముద్ర వేశారు. సత్యారావు మాస్టారికి పిల్లనివ్వకుండా చేశారు. బెంగతో తల్లి చచ్చిపోయింది. ఉన్న అక్కను బావ పంపటం మానేశాడు.

సత్యారావు మాస్టారు భయపళ్ళేదు.

యువతలో వచ్చిన మార్పు సత్యారావు మాస్టారిలో నూతనోత్సాహాన్నీ, చైతన్యాన్నీ తెచ్చింది. ఎలిమెంటరీ స్కూలు మిడిల్ స్కూలయింది. సత్యారావే హెడ్మాష్టారయ్యారు.

సాయంకాలాల్లో హరిజనవాడ వెళ్ళి 'మద్యం మానండి' అంటూ – మద్యం వల్ల వచ్చే నష్టాలపై చిన్న చిన్న నాటకాలుగా పిల్లలతో ప్రదర్శించేవారు.

హరిజనవాడలోనూ కొంత మార్పు వచ్చింది.

ఊళ్ళో ఇచ్చిన వాళ్ళ దగ్గర చందాలు పోగుచేసి – పేదల పిల్లలకు, వర్ణ వివక్ష లేకుండా ఫీజులు కట్టించి – కాలేజీలకు పంపారు.

పోలారావునీ, మరికొంతమంది బడుగు వర్గాల వారినీ దత్తత తీసుకుని చదివించారు. ఓర్వలేని సహకులస్థులు సత్యారావుకి 'మాల మేస్టారు' అని బిరుదు ఇచ్చేశారు. ఊళ్ళో సత్యారావు కోసం ఎవరైనా వస్తే –'మాల మేస్టారా?' అన్నంతగా ప్రసిద్ధికెక్కింది ఆ పేరు.

సత్యారావు మాస్టారికి తరువాత కొంతమంది పిలిచి పిల్లనిస్తామన్నా – ఆయన పెళ్ళి చేసుకోలేదు.

అతనికెన్నో అవార్డులొచ్చినా దేన్నీ స్వీకరించలేదు. సత్యారావు మాస్టారి శిష్యులు దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు.

అదే అతనికి గర్వకారణం !

అయితే అది మాస్టారి గొప్పంటే మాత్రం ఆయన అంగీకరించడు !

***

"అందుకేరా ! ఆయన మహానుభావుడంటాను. అలాటి మహానుభావునిదయా దాక్షిణ్యాల ఫలమే

నాకు లభించిన ఉద్యోగం... నువ్వీస్థితికి పెరగడం! అలాటి మహానుభావునికి నేను పంపుతున్న అయిదు వందలూ, కృతజ్ఞతతో.. అయన నామస్మరణ చేసుకోవటం తప్పంటావా ? అలాటి మహానుభావుల సేవ చేసుకోవటమే బానిసతనమంటే – నేను నిజంగా బానిసనే. అందుకు సిగ్గుపడను'' అన్నాను.

నా మనసిప్పుడు ప్రశాంతంగా ఉంది.

ఇంతలో పోస్టుమన్ వచ్చి, ''నమస్తే పోలారావుగారూ ! మీకో ఉత్తరమూ – మనియార్డరూ . . . తి. . రి. . గొ. .చ్చినట్లుంది''

అని లైన్లో పెట్టిన మనియార్డరు ఫారాలు లోంచి ఓ ఫారం, జేబులోంచి సొమ్ము తీసి అందించాడు.

కళ్ళజోడు సవరించుకుని ఎం.ఓ అందుకున్నాడు. సత్యారావు మాస్టారి నుండి తిరిగొచ్చింది. పోలారావుకి చెమట్లు పోశాయి. 'మాస్టారికేమయిందా ? అని కవరు చించాడు. దస్తూరీ మాస్టారిది కాదు. వణుకుతున్న చేతులతో, తడబడుతున్న మనసుతో ఉత్తరం చదవటం మొదలుపెట్టాడు గట్టిగా బయటికే.

''ప్రియ శిష్యుడు చిరంజీవి పోలారావుకు,–ఆశీస్సులతో

సత్యారావు మాస్టారు రాయిస్తున్న లేఖ. నాన్నా ! నీవు ప్రేమతో పంపిన సొమ్ము తిప్పిపంపుతున్నందుకు బాధపడకు. నాకు ప్రస్తుతం సొమ్ము అవసరం లేదు.

నీ స్నేహితుడు రాజారావు రిటైరయ్యాడు కదా ? నేను ఒంటరి వాణ్ణయాను. తొంభై ఏళ్ళుంటాయి. దృష్టి కొంచెం తగ్గింది. ఒరే, అబ్బాయ్ ! ఊరు మళ్ళీ మారిపోతోందిరా ! జనంలో అవినీతి పెరిగిపోయింది. పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ఈ మధ్య సాయంకాలాల్లో రామ్మందిరం గడప మీద పురాణాలు, భగవద్గీతా చెపుతున్నాను. పిల్లలచే శతక పద్యాలు బట్టీ పెట్టిస్తున్నాను. మన పాత విద్యార్థులు ఎక్కడెక్కణ్ణించో ఎం.ఓలు పంపుతున్నారు. కానీ, అబ్బాయీ ! నాకు మనుషులు కావాలిరా సాయానికి ! రాజారావు వచ్చేస్తున్నాడు. మరి కొంతమంది రిటైరయి వస్తున్నారు. ఊళ్ళో తాడుగూ, పేకాటా ఎక్కువైపోయింది. దీనికి తోడు ఎవరెవరో ఇతర మతాల వాళ్ళు వచ్చి ఏవేవో ప్రలోభాలు పెట్టి జనాలను రెచ్చగొడుతున్నారు. వాళ్ళ మతం గురించి చెప్పుకోనీ. కాదనను. కానీ, మత విద్వేషం రెచ్చగొట్టటం – వీళ్ళూ వాళ్ళూ కొట్లాడుకోవటం – ప్చ్ ! – ఎక్కడికి పోతున్నామో అర్థం కావటం లేదురా !

నువ్వొచ్చేరా !

మనమందరం ఒక వేదిక ఏర్పాటు చేసి మంచి యువతను తయారు చెయ్యాలి ! నేను బ్రహ్మచారి ముండావాణ్ణి ! నువ్వు సంసారివాయే! వచ్చేయమంటున్నానని విసుక్కోకు !

నీకు వీలయితే రా !

డబ్బులవసరం పడితే అడుగుతా. అంతవరకూ పంపొద్దు. పిల్లాడు బావున్నాడా ? ఆశీస్సులు. నీ ఉత్తరం కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తూ.

సత్యం మాస్టారు''

ఉత్తరం చదివిన పోలారావు ఆనందవర్షంలో తడిసాడు. ''విన్నావ్ కదరా ! ఆ మహానుభావుని సేవించటంలో తప్పుందంటావా ? మంచికీ, మానవత్వానికీ సేవ చేయటం బానిసత్వమే అంటావా ? అలా అయితే నేనూ బానిసనే'' అని నేనన్నప్పుడు 'సారీ నాన్నా !' అని రాము నోటంట రావటం నాకు విజయంగా అనిపించింది !

❑

రచయిత సెల్ నెం: **9440059067**

# పెద్దల పాపఫలం పిల్లలకు వర్తిస్తుందా?

## సందేహాలు – సమాధానాలు

**కె.ప్రసన్నా దుర్గాప్రసాద్, హైదరాబాద్**

**సముద్ర స్నానానికి అర్హనీయ కాలం ఏది ?**

అమావాస్య, పౌర్ణమినాడు ఇతర పర్వదినాలలోను సముద్రస్నానం అర్హనీయం. శుక్రవారం, మంగళవారం సముద్ర స్నానం నిషిద్ధం. మిగతా కాలంలో సముద్ర స్నానం దోషం. దీనివల్ల సకల అరిష్టాలు కలుగుతాయి.

**కె.హనుమంతు, వసంతవాడ**

**గయలో ఇష్టమైన పండో, కూరగాయనో ఎందుకు వదిలి వేస్తారు?**

ఇంద్రియాలను అదుపులో ఉంచుకునేందుకే ఈ నియమనిష్ఠ. ఇది ఆరోగ్య దాయకం. అలా వదిలివేసిన తర్వాత దానిని జీవితంలో తిరిగి ముట్టకూడదు. జీవన పయనంలో ఒక వయసుకు చేరుకున్న తరువాత కామక్రోధలోభ మోహాలను అదుపు చేసుకోవటంలో భాగంగానే ఈ పుణ్యకార్యం చేస్తారు.

**మణి, సింహాచలం.**

**తల్లిదండ్రుల పాప ఫలం బిడ్డలకు తగులుతుందా?**

మనది వేదభూమి. కర్మభూమి. ఈ కర్మభూమిలో కుటుంబ వ్యవస్థ ఎంతో గొప్పది. ప్రపంచ దేశాలలో ఎక్కడాలేనన్ని బంధాలు, అనుబంధాలు, అనురాగాలు, ప్రేమాభిమానాలు, బంధుత్వాలు సహకార భావన ఇక్కడే ద్యోతకమవుతుంది. తల్లిదండ్రులకు సమాజంలో ఉన్న మంచిపేరునుబట్టే ఆ కుటుంబానికీ ఇరుగు పొరుగు నుంచి, బంధువుల నుంచీ మొత్తంగా సమాజం నుంచి గౌరవ ప్రతిష్ఠలు కలుగుతాయి. వారు చేసిన పాపాలు, నేరాల ప్రతిఫలాన్ని ఆ కుటుంబం ఇహలోకంలోనే అనుభవిస్తుంది. తిలాపాపం తలా పిడికెడు చందంగా ఆ పాపం కుటుంబమంతటికీ వర్తిస్తుంది. నారద పురాణం దీనిని మనకు వివరిస్తుంది. తండ్రి చేసిన పాపాలు మూడు వంతులు కుమార్తెకు, తల్లి చేసిన పాపాలు నాలుగింతలు కుమారుణ్ణీ పట్టిపీడిస్తాయి. వారి జీవితాలు నరక ప్రాయమవుతాయి. వారు చేసిన పుణ్యాలూ వారి బిడ్డల జీవితాలను సుఖమయం చేస్తాయి.

**కాశ్యప్, రాజమండ్రి.**

**దానాలు చేస్తే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందా ?**

ప్రతీ మతమూ ప్రత్యక్షంగా పరోక్షంగా దాన గుణాన్ని బోధించింది. మానవతా దృక్పథం, కరుణరస హృదయాన్ని మానవులు కోల్పోరాదు. కర్ణుడూ బలిచక్రవర్తి వంటి అనేక పాత్రలతోపాటు కన్నకొడుకునే బలి ఇచ్చిన మహాపురుషుల కథలెన్నో ఉన్నాయి. అతిథి దేవోభవ అని అందుకే అన్నారు. అతిథి కడుపు నింపిన తర్వాతే ఆ కుటుంబం భోజనం చేసే పూర్వాచారం ఇందుకే! మనిషై పుట్టినవాడు ఉన్నదానిలో పొరుగువారికి సాయం చేయాలనే దానగుణాన్ని అన్ని మతాలు నూరిపోశాయి. సాక్షాత్తూ భగవంతుడే భవతీ భిక్షాందేహీ అంటూ ఇంటి ముందు చెయ్యి చాచాడనే కథలు మనిషిని చెక్కుచెదరని దానశీలిగా తీర్చిదిద్దేందుకే! మనిషి పవిత్ర కార్యాలలో, ప్రథమ కర్తవ్యాలలో ఇదికూడా ఒకటి. అందుకే ధనవంతులు సత్రాలు, నిత్య సంతర్పణలు చేసే ఆవాసాలను ఆలయాలనూ నిర్మించేది. దాన గుణం స్వర్గలోక ప్రాప్తి చేకూరుస్తుంది. దానగుణంతో ధర్మాన్ని కాపాడాలని, పోయేటప్పుడు కట్టుకుపోయేదేదీ లేదని పురాణాలు, ఇతిహాసాలు వివరిస్తున్నాయి. దానధర్మాలు చేయడం ఈ యుగ ధర్మం. భవిష్యత్ పురాణం, పరాశర స్మృతి వీటిని తెలియజేస్తాయి.

మీ సందేహాలకు సమాధానాలు ఆశిస్తే మీరడగదల్చుకున్న ప్రశ్నలను కార్డుపై రాసి కింది చిరునామాకు పంపండి

**సందేహాలు–సమాధానాలు, నవ్యవీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం. 76, అశ్వనీ లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ – 500033**